క్లుప్తంగా

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ



శ్రీధర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి

సూర్యాపేట రూరల్ : ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శిరీష భర్త పిండిగ శ్రీధర్ గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆదివారం శ్రీధర్ చిత్రపటానికి మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వర్లు, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కళారంగానికి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న నాయకులు, కళాకారులు

అర్వపల్లి : ప్రజా నాట్యమండలి సీనియర్ కళాకారుడు రాజు అకాల మరణం కళారంగానికి తీరనిలోటని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీ నర్సయ్యయాదవ్, సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ ఎంపీపీలు తాటికొండ సీతయ్య, కొత్తగట్టు మల్లయ్య అన్నారు. జాజిరెడ్డిగూడెనికి చెందిన ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారుడు పగిడిమర్రి రాజు చెరువులో పడి మృతి చెందడంతో ఆదివారం ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ రూ.10వేలు, సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం రూ.5వేలు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా నాయకుడు కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు, వేల్పుల వెంకన్న, బుర్ర శ్రీనివాస్, వజ్జె శ్రీనివాస్, బి. రాంబాబు, ఈదురు వీరపాపయ్య, బూర్గుల ప్రభాకర్, సాంస్కృతిక సారథి కళాకారులు ఉన్నారు.

ఆధార్య ఫౌండేషన్ మండల కమిటీ ఎన్నిక



నాగారంలో నూతన కమిటీ ఎన్నికలో పాల్గొన్న తాడోజు శ్రీకాంత్‌రాజ్

నాగారం : ఆరాధ్య ఫౌండేషన్ మండల నూతన కమిటీని నాగారంలో ఫౌండేషన్ చైర్మన్ తాడోజ్ వాణిశ్రీకాంత్‌రాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాశం మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నరేష్, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా బుక్క శ్రీను, కార్యదర్శిగా నగేష్‌చారి, కోశాధికారిగా కనకం సైదులు, సలహాదారుగా సోమేష్, గౌరవ అధ్యక్షుడిగా నరేష్, కార్యవర్గ సభ్యులుగా మద్దెల మహేష్‌లను ఎన్నుకున్నారు. ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజ్ శ్రీకాంత్‌రాజ్ నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రాలను అందించి, వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పొర్ల నాగరాజు, ప్రసన్న, యశ్వంత్, ఏలేందర్, చాగంటి రాజు, వీరేశం, అభిలాష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు టీకాలు

అర్వపల్లి : తిమ్మాపురం గ్రామంలో జీవాలకు నీలి నాలుక రోగ నిరోధక టీకాల శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 290జీవాలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్, తిమ్మాపురం పశువైద్యశాల వీఎల్‌ఓ కేఎస్‌ఎస్ పద్మ, రైతులు పాల్గొన్నారు.

సంప్రదాయ పండుగలకు నిలయం తెలంగాణ

కోదాడరూరల్ : సంస్కృతి, సంప్రదాయ పండుగలకు తెలంగాణ రాష్ట్రం నిలయమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మంగళితండాలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి అభివృద్ధికి బాటలు వేశారని తెలిపారు. సీత్లాభవానీ అమ్మవారి ఆశీస్సులతో పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. వారితో కలిసి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమావత్ పద్మాజబ్బార్, ఉపసర్పంచ్ వాసు, సావిత్రి, నాగ, లచ్చు, సింహాద్రి పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ..

పట్టణ పరిధిలోని తమ్మరకు చెందిన సామినేని వెంకటేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయనతో పాటు నెల్లూరి నరసింహారావు, వహీద్‌ను కూడా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

ఆయిల్ బాల్.. దోమలు పరార్ !

- ఆయిల్ బాల్స్ వినియోగంతో గత ఏడాది సత్ఫలితాలు
- ఈసారి కూడా అదేబాటలో అధికారులు



దోసపహాడ్‌లో ఆయిల్ బాల్స్ వదులుతున్న అధికారులు (ఫైల్)



ఆయిల్ బాల్స్ తయారు చేస్తున్న సిబ్బంది

పెన్‌పహాడ్ : దోమల నివారణకు జిల్లా యంత్రాంగం సూచనల మేరకు క్షేత్రస్థాయిలో ఆయా గ్రామాల్లో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పెన్‌పహాడ్ మండలంలోని పలు గ్రామాల్లో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ తయారు చేస్తున్నారు. వాటిని నీరు నిల్వ ఉన్న కుంటలు, బావుల్లో వదులుతున్నారు. దీంతో సత్ఫలితాలు వస్తున్నాయి.

తయారీ ఇలా...

దోమల నివారణకు ఎన్నో సదుపాయాలు ఉన్నా ముఖ్యంగా ఆయిల్ బాల్స్ విధానం మంచి ఫలితాన్ని ఇస్తోంది. ఈ విధానాన్ని నేడు పల్లెల్లో ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తూ దోమల నివారణకు అధికారులు కృషి చేస్తున్నారు. ఆయిల్ బాల్స్ తయారీకి రంపం పొడి (కట్టె పొడి), ఇసుక, సున్నం , ఇంజన్ ఆయిల్ అవసరం అవుతాయి. రంపం పొడి, ఇసుక, సున్నం మిశ్రమాన్ని ఒక బాల్ రూపంలో తయారు చేసి దానిని ఒక క్లాత్‌లో లేదా సంచిలో ఉంచి ఇంజన్ ఆయిల్‌లో ఒక గంటపాటు నానబెడతారు. దీంతో ఆయిల్ బాల్స్ సిద్ధమవుతాయి. వాటిని మురుగు కాలువల్లో, గుంతల్లో వేయడం ద్వారా దోమలను నివారించవచ్చు.

ప్రయోజనం ఇలా..

డెంగీ వ్యాధికి కారణమయ్యే దోమల నివారణలో కూడా ఆయిల్‌బాల్స్ విశేషంగా ఉపయోగపడుతున్నాయి. పల్లెల్లో ఈ విధానాన్ని ఉపయోగించి ఆశించిన ఫలితాలను పొందుతున్నారు. ఆయిల్ బాల్స్‌ను మురుగు కుంటల్లో వేయడం వల్ల బాల్స్‌లో నుంచి నూనె బయటికి వచ్చి మురుగు నీటి ఉపరితలంపై ఒక వలయంగా చేరుతుంది. దీంతో మురుగు నీటిపై దోమలు వాలకుండా ఉంటాయి. కుంటలోపలి భాగంలో ఉన్న దోమలు పెట్టిన గుడ్లు, లార్వాలకు ఆక్సిజన్ అందకపోవడంతో అవి కూడా నశించిపోతాయి. సింగారెడ్డిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గత సంవత్సరం ఆయిల్ బాల్స్ తయారు చేసి గ్రామ పరిధిలోని మురుగు కాల్వలు, గుంతల్లో వేయడం ద్వారా దోమలను నివారించగలిగారు. ప్రస్తుతం దోసపహాడ్ గ్రామంలో కూడా ఇదే విధానాన్ని అమలు చేస్తున్నారు.

గతేడాది దోమలను అరికట్టగలిగాం



“దోమల నివారణకు గ్రామ పంచాయతీ పరిధిలో అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం. గత ఏడాది ఆయిల్ బాల్స్ ఉపయోగించి దోమలను అరికట్టగలిగాం. ఈసారి కూడా అదే పద్ధతి అవలంభించాలని నిర్ణయించాం. ఇందులో భాగంగా ఆయిల్ బాల్స్ తయారు చేస్తున్నాం.”

– నరేష్, ఎంపీఓ

పారిశుద్ధ్యం మెరుగునకు ప్రాధాన్యం



“గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధితో పాటు పారిశుద్ధ్య మెరుగుకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నాం. పరిసరాల పరిశుభ్రతకు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. స్వచ్ఛత పాటించాలని ప్రజలకు సూచిస్తున్నాం.”

– దొంగరి సుధాకర్, సర్పంచ్, దోసపహాడ్

గ్రామ పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలి



ఆత్మకూరులో 25 సంఖ్య ఆకృతిలో కూర్చున్న గ్రామ పంచాయతీ కార్మికులు



అర్వపల్లిలో జీపీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

అర్వపల్లి : గ్రామ పంచాయతీ కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 25వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు దనియాకుల శ్రీనివాస్, తన్నీరు వెంకన్న, కార్మికుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కన్నెబోయిన శ్రీశైలం, గుగులోతు నాగులునాయక్, చెరుకు శంకర్, యాకూబ్, ప్రవీణ్, బాషమియా, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె ఆదివారం కొనసాగింది. సమ్మెలో మండల అధ్యక్షుడు కె.సాగర్, రాంబాబు, ఉప్పలయ్య, భానోతు కృష్ణ, ఈదయ్య, శంకర్, సురేష్ పాల్గొన్నారు.

25 సంఖ్య ఆకృతిలో కూర్చొని నిరసన..

ఆత్మకూర్ (ఎస్) : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 25వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు 25 సంఖ్య ఆకృతిలో కూర్చొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

25వ రోజుకు చేరిన సమ్మె

తిరుమలగిరి : తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం 25వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో బక్కయ్య, యాకయ్య, వెంకన్న, రాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నూతనకల్ : గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం అమలుచేయాలని కారోబార్‌ల సంఘం జిల్లా నాయకుడు నకిరేకంటి శంభయ్య ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేస్తున్న సమ్మెలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో..



నూతనకల్‌లో..

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ వేముల గణేష్ తల్లి, సీనియర్ నాయకురాలు భద్రమ్మ ఇటీవల మరణించింది. దీంతో ఆమె కుటుంబానికి అర్వపల్లి దేవస్థాన మాజీ చైర్మన్ బొడ్డు రామలింగయ్య యాదవ్ ఆదివారం రూ. 25వేల ఆర్థికసాయం, రెండున్నర క్వింటాల బియ్యం అందజేశారు. భద్రమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లొడంగి లింగరాజు, మెండె సురేష్, ఉయ్యాల రాము, ఇటికాల సాయిలు, తిరుపతయ్య, శ్రీను, వెంకన్న, సైదులు, రవి, సాయి, సతీష్, చిరంజీవి, గోవర్ధన్, శ్రీను పాల్గొన్నారు.

మద్దిరాల : మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన బర్పటి రవి కుమారుడు కార్తీక్ (10) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. దీంతో అతడి మృతదేహాన్ని తెలంగాణ ఉద్యమకారులు, ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు శ్రీకాంత్ రాజ్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కన్వీనర్ తన్నీరు మహేష్, తునికి బద్రి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం చేస్తున్న బొడ్డు రామలింగయ్య



మద్దిరాల : రెడ్డిగూడెంలో మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చేస్తున్న శ్రీకాంత్ రాజ్

ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్ర నష్టం

మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆదివారం బాధిత రైతులు తెలిపిన ప్రకారం.. కుక్కడం గ్రామానికి చెందిన బింగి భిక్షం కోళ్లఫాంలోకి వరద నీరు చేరి దాదాపు పదిహేను వందల కోళ్లు చనిపోయాయి. గోరెంట్లకు చెందిన తూతుర్ల కుంట కట్టకు గండి పడి పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



కుక్కడం గ్రామంలో వరద ప్రవాహానికి కోళ్లఫాంలో చనిపోయిన కోళ్లు



గోరెంట్లలో తూతుర్ల కుంటకు పడిన గండి

టీజీవీపీ ఆవిర్భావ దినోత్సవం

సూర్యాపేటటౌన్ : తెలంగాణ విద్యార్థి పరిషత్ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీవీపీ రాష్ట్ర కార్యదర్శి రత్నావత్ వంశీ జెండా ఎగురవేసి మాట్లాడారు. సంఘం ఆవిర్భావం నుంచి విద్యార్థుల సమస్యల పట్ల రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు విష్ణు, అరుణ్, అజయ్, ఉదయ్, అక్షయ్, నాని, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలని ర్యాలీ



చివ్వెంలలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

చివ్వెంల : మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అరాచకాలను అరికట్టి, వారికి రక్షణ కల్పించాలని మండల కేంద్రంలో మన్నా చర్చి ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మణిపూర్‌లో మహిళలను చిత్రహింసలకు గురిచేయడం దారుణమన్నారు. వారి రక్షణ కోసం ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ సామియేలు, 30 మంది క్రైస్తవులు పాల్గొన్నారు.

రహదారిపై గుంతల పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..

తిరుమలగిరి : తిరుమలగిరి మండల పరిధిలోని వలిగొండ–తొర్రూరు ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను ఆదివారం ఆర్‌అండ్‌బీ సిబ్బంది పూడ్చివేశారు. ఈ నెల 21న సాక్షి దిన పత్రికలో ‘ప్రమాదకరంగా ప్రధాన రహదారి’ అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా అధికారులు స్పందించారు. రహదారిపై గుంతలను పూడ్చించాలని ఆర్‌అండ్‌బీ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు సిబ్బంది రహదారిపై మరమ్మతులు చేపడుతున్నారు.



వెలిశాల సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చుతున్న సిబ్బంది

పారిశుద్ధ్య పనుల పరిశీలన

మద్దిరాల : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సరోజ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆమె ఆకస్మికంగా పరిశీలించి మాట్లాడారు. డ్రెయినేజీల్లో మట్టిలేకుండా తీయాలని, లేదంటే నీళ్లు నిల్వ ఉండి దోమలు, ఈగలు చేరి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పారిశుద్ధ్య కార్మికులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మొక్కలు నాటి సంరక్షించాలి

నడిగూడెం : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు దేవబత్తిని వెంకటనర్సయ్య, నడిగూడెం సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి కోరారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఆదివారం నడిగూడెం, తెల్లబెల్లి గ్రామాల్లో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటే మొక్కలను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ నసీమా, నడిగూడెం పంచాయతీ కార్యదర్శి రాము, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, బీఆర్‌ఎస్ నాయకులు కాసాని వెంకన్న, ఎస్‌కె.జలీల్, భోనగిరి ఉపేందర్, మేకల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

నాగారం : సీఎం సహాయనిధిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య అన్నారు. వస్తాల గ్రామానికి చెందిన ఎ.కిరణ్మయికి ప్రభుత్వం నుంచి రూ.18,000ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. దీంతో మండల పరిధిలోని ఫణిగిరిలో బుధవారం ఆమె కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకుడు మల్యాల అశోక్, తీగుళ్ల యాదగిరి పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

మునగాల : మండలంలో నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఐదు రోజులు మాత్రమే ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు బీమా దరఖాస్తు చేసుకునే రైతులు తమ దరఖాస్తుతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జీరాక్స్ ప్రతులను రైతు వేదికలో అందజేయాలని సూచించారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



తిరుమలగిరిలో నూతనంగా ఎన్నికైన కమిటీని సన్మానిస్తున్న సభ్యులు

తిరుమలగిరి : లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని సూర్యాపేట జిల్లా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య అన్నారు. ఆదివారం శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమనర్సయ్య మాట్లాడారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా మందడి పద్మారెడ్డి, కార్యదర్శిగా కందుకూరి లక్ష్మయ్య, కోశాధికారిగా జి.సురేష్‌యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనర్సింహారావు, చంద్రశేఖర్, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, నరోత్తమ్‌రెడ్డి, కొమ్మినేని సతీష్, రామచంద్రం గౌడ్, ఐతె శ్రీనివాస్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, కృష్ణమాచారి పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర సినారేది



సినారే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వట్టె జానయ్యయాదవ్ తదతరులు

సూర్యాపేటటౌన్ : డాక్టర్ సి.నారాయణరెడ్డి తన రచనల ద్వారా విశ్వవ్యాప్త సుప్రసిద్ధ కవిగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, బాలభవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణరెడ్డి, బుర్రి వెంకటేశ్వర్లు, గుండా రమేష్, హమీద్‌ఖాన్, చిన శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

చెస్‌తో పిల్లల్లో ఏకాగ్రత పెరుగుతుంది



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న గండూరి కృపాకర్

సూర్యాపేటటౌన్ : చెస్ క్రీడతో పిల్లల్లో ఏకాగ్రత పెరుగుతుందని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కిరాణ మర్చంట్స్ అసోసియేషన్ భవన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి చెస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్నతనం నుంచే చెస్ క్రీడను అలవాటు చేసుకోవడం వల్ల క్రమశిక్షణ, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అండర్ 11, అండర్ 19 విభాగాల్లో బాలబాలికలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్.సతీష్‌కుమార్, సాయికుమార్, లింగారెడ్డి, మురళి, వరప్రసాద్, జానయ్య, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

నాగారం : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకారపు రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి, నష్టపరిహారాన్ని అంచనా వేయాలన్నారు. ఎకరాకు రూ.25వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆయనతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు పులుసు శేఖర్, బొంకూరి అజయ్, లింగరాజు, వెంకన్న ఉన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

భానుపురి : రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని ఉర్దూ ఘర్ షాదీఖాన చైర్మన్ కరాటే సయ్యద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీలు స్వయం ఉపాధి పొందేందుకు రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తుందని తెలిపారు. ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో వేల కోట్ల రూపాయలు కేటాయించి మైనార్టీ మహిళల అభివృద్ధికి ఖర్చు చేస్తుందని పేర్కొన్నారు.

తుంగతుర్తి : మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మండల మైనార్టీ కోఆప్షన్ మెంబర్ ఎండీ బాబాఫజులోద్దీన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మైనార్టీల స్వయం ఉపాధి కోసం రూ. లక్ష ఆర్థికసాయం జీఓ విడుదల చేయడం హర్షణీయమన్నారు. ప్రభుత్వం మైనార్టీల సంక్షేమ కోసం వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయిస్తుందన్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

మద్దిరాల : మండల పరిధిలోని గ్రామాల్లో సోమవారం నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి అసిఫా తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నేటి నుంచి ఆగస్టు 31 వరకు అన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు.

నిండుకుండలా చెరువులు



వర్షాలతో నిండిన జాజిరెడ్డిగూడెం తీగల చెరువు



నిండి అలుగు పోస్తున్న కొమ్మాల చెరువు

- మొన్నటి వరకు వెలవెలబోయిన చెరువులకు వర్షాలతో జలకళ
- జాజిరెడ్డిగూడెం మండలంలో దాదాపు 25వేల ఎకరాల్లో పంటల సాగు

అర్వపల్లి : మొన్నటి వరకు వెలవెల బోయిన చెరువులు, కుంటలు ఇటీవల కురిసిన వర్షాలతో జలకళను సంతరించుకున్నాయి. జాజిరెడ్డిగూడెం మండలంలో మొత్తం 81 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇందులో వందెకరాలకు పైబడి ఆయకట్టుగల చెరువులు ఆరు ఉండగా, వందెకరాలలోపు ఆయకట్టుగల చెరువులు 75 వరకు ఉన్నాయి. వీటికింద మండలంలో 6 వేల ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. కాగా ఈ చెరువులు, కుంటల్లో నీళ్లు ఉంటే మరో 10 వేల ఎకరాల వరకు బోర్లు, బావుల కింద పంటలకు నీళ్లందుతాయి. మండల వ్యాప్తంగా ఈ వానా కాలం సీజన్లో సుమారు 25 వేల ఎకరాల్లో పంటలు సాగుకానున్నాయి. ఇందులో ఎక్కువగా వరిపంట సాగుచేయనున్నారు. దీనికి తోడు గోదావరి జలాలు వదిలితే పంటలు మరింత పుష్కలంగా పండనున్నాయి. చెరువులు, కుంటలు నిండటంతో సాగు నీటి సమస్య తీరి రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు.

నీటి సమస్య తీరింది



“మొన్నటి వరకు సరైన వర్షాలు రాక పంటలు ఎలా సాగుచేయాలని ఇబ్బంది పడ్డాం. అయితే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండాయి. ఈ సీజన్‌లో పంటలకు ఎలాంటి డోకా ఉండదు. అలాగే కాళేశ్వరం జలాలు కూడా త్వరలో రానున్నాయి.”

– వజ్జె సైదులు, రైతు, అడివెంల

అలుగు పోస్తున్నాయి



“పది రోజులుగా కురిసిన వర్షాలతో మండల వ్యాప్తంగా చెరువులు, కుంటలు నిండి అలుగుపోస్తున్నాయి. మండలంలో 81 చిన్ననీటి వనరులు ఉన్నాయి. ఈ వానాకాలం సీజన్‌లో సుమారు 25 వేల ఎకరాల వరకు పంటలు సాగు కానున్నాయి.”

– జి.హరిస్వరూప్, నీటిపారుదల శాఖ ఏఈఈ